రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఎఫ్ఐఆర్ నమోదు చేశాకే దహన సంస్కారాలు జరపాలి




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 289 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 13 అక్టోబర్ 2026

## ఎన్నికల్లో ఓటమి భయంతోనే
# ‘సర్’ అమలు

● సీఎం రేవంత్‌రెడ్డి ● ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై కేంద్రాన్ని నిలదీత




**న్యూఢిల్లీ,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటమి భయంతోనే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అమలు చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగిస్తున్నారంటూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్య ఎలా తగ్గుతుందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ ఆయన ఆరోపించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి మిగతా2లో...



## ఆరు రాష్ట్రాలకు
# కొత్త గవర్నర్లు

నలుగురికి తొలిసారి అవకాశం.. ఇద్దరు గవర్నర్ల బదిలీ

నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి కొత్త నియామకాలు, బదిలీలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఈ నియామకాలు అమల్లోకి రానున్నాయి. **ఆరుగురు గవర్నర్ల వివరాలు** సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మిగతా2లో...

## పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్
# స్వర్గధామం

● రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి ● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ● రూ.6,347 కోట్ల పెట్టుబడులు.. 18 వేల మందికి ఉపాధి అవకాశాలు




## దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి
# భారీ ప్రణాళిక




## ఆర్టీసీ - మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలపై
# పునఃసమీక్ష

సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరల నిర్ణయం

త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్:అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో ప్రయాణికులకు ఆర్టీసీ, మెట్రో సేవలను కలిపి అందించే ఉమ్మడి పాస్ చార్జీలను తెలంగాణ ప్రభుత్వం పునఃసమీక్షించనుంది. ప్రస్తుత ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయంటూ ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చార్జీలను సవరించే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. **రోజువారీ పాస్ రూ.400.. నెలవారీ పాస్ రూ.8,500** ప్రస్తుతం ఆర్టీసీమెట్రో ఉమ్మడి పాస్ రోజువారీ ధర రూ.400గా, నెలవారీ ధర రూ.8,500గా ఉంది. ఈ ధరలపై ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పునఃపరిశీలనకు సిద్ధమైంది. ముఖ్యంగా నిత్యం ఉద్యోగాలు, మిగతా2లో...



## మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తాం: కవిత

**హైదరాబాద్,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** తమ పార్టీ తరఫున మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇతర రాజకీయ పార్టీలు రిజర్వేషన్లు అమలు చేసినా, చేయకపోయినా తమ పార్టీ మహిళలకు సగం సీట్లు ఇస్తుందని స్పష్టం చేశారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు మహిళలు, బహుజనుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ దిశగా తనకు ప్రజలు ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మిగతా2లో...

## సీఈసీపై
# జనాగ్రహం..

ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ప్రదర్శన

ఓటు హక్కుల పరిరక్షణకు నినాదాలు.. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్




**న్యూఢిల్లీ, 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు సోమవారం ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా బయలుదేరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తెలంగాణ మిగతా2లో...

## ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన
# కార్యాచరణ ఏదీ?

రైతులు, కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి: హరీశ్‌రావు




**హైదరాబాద్,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందించాలని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత, విద్యుత్ సమస్యలతో రైతులు మిగతా2లో...

# సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

## - సీజేఐ సూర్యకాంత్



**న్యూఢిల్లీ,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనల కారణంగా న్యాయస్థాన కార్యకలాపాలకు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ, మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక
మంగళవారం 13 అక్టోబర్ 2026

## ఆర్టీసీ – మెట్రో ఉమ్మడి పాస్ చార్జీలపై పునఃసమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే వారికి పాస్ ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. ఉన్నతాధికారు లతో చర్చించి నిర్ణయం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఉమ్మడి పాస్ చార్జీలను పునఃసమీక్షించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ అంశంపై త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే ధరలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో ప్రజా రవాణా సేవలను వినియోగించే ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించే దిశగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. అయితే సవరించిన చార్జీలపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

## మోదీకి కేసీఆర్ గతే: పొంగులేటి



**హైదరాబాద్,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజల గొంతును అణచివేయాలని చూస్తే వారికి రాజకీయంగా తగిన గుణపాఠం తప్పదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, రాజకీయ పార్టీలకు ఉందని పేర్కొన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ ప్రధాన వేదికగా ఉండేదని పొంగులేటి గుర్తుచేశారు. అయితే, కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్‌ను తొలగించి ప్రజల నిరసన హక్కును అడ్డుకుందని విమర్శించారు. నిరసన తెలిపే అవకాశాలను పరిమితం చేసినందుకు ప్రజలు ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని అన్నారు.కేసీఆర్ అనుసరించిన విధానాలనే ప్రస్తుతం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని పొంగులేటి ఆరోపించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వంటి ప్రాంతాల్లో నిరసనలు తెలిపే హక్కులపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం లేకుండా చేయడం సరికాదన్నారు.ప్రజల గొంతును అణచివేయాలని చూసే పాలకులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని పొంగులేటి హెచ్చరించారు. నిరసన హక్కును గౌరవించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

(మొదటి పేజీ తరువాయి)

మాథుర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు తమిళనాడు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్, కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధాల్ సింగ్ బిసేన్, సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్‌ను నియమించారు. **నలుగురికి కొత్త బాధ్యతలు** ఈ నియామకాల్లో భాగంగా బ్రజ్ మోహన్ రామ్, సుధా యాదవ్, ధాల్ సింగ్ బిసేన్, దుష్యంత్ గౌతమ్‌లకు కొత్తగా గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఓం ప్రకాశ్ మాథుర్, రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌లను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వహించేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటనలో పేర్కొంది.దేశంలోని ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల మార్పులతో ఆయా రాష్ట్రాల రాజ్యాంగపరమైన వ్యవహారాల్లో కొత్త నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారికంగా తమ విధులను ప్రారంభించనున్నారు.

## దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి భారీ ప్రణాళిక

**అమరావతి: అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):**దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత విస్తరించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని ప్రోత్సహించే దిశగా 5 వేల ఆలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలు నివసించే ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆలయాల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, అర్హమైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఆవాసాలు, మత్స్యకారుల నివాస ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీల్లో ఆలయాలు నిర్మించడం ద్వారా స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న స్థలాలు, నిర్మాణానికి అవసరమైన సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి 28 జిల్లాల్లోని 161 నియోజకవర్గాల నుంచి మొత్తం 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో 967 ఆలయాల నిర్మాణం ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ఆలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు, అనుమతులు, నిధుల కేటాయింపు, నిర్మాణ పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు.ఆలయాల నిర్మాణం కేవలం భవనాల ఏర్పాటుకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేలా ఉండాలని అధికారులు భావిస్తున్నారు. నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ లక్ష్యాన్ని 2028 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఆలయాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా ప్రారంభం కావాల్సిన పనుల వివరాలను సేకరించి తదుపరి కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరితే వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగానే ఆలయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

**కాకినాడ అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు లాభాలతోపాటు దేశాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇబ్బందులు ఉండేవని పవన్ కల్యాణ్ విమర్శించారు. ప్రస్తుతం పెట్టుబడిదారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. **రూ.6,347 కోట్ల పెట్టుబడులతో కొత్త అవకాశాలు**కాకినాడలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులకు




సంబంధించిన కార్యక్రమాలతోపాటు, రూ.2,090 కోట్లతో నాలుగు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కాకినాడ, పరిసర ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. **714 ప్రాజెక్టుల ద్వారా రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు** 2024 జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు అనుమతులు పూర్తయ్యాయని, రూ.4.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7.1 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. **పర్యావరణ పరిరక్షణతో సమగ్ర అభివృద్ధి**కాకినాడలో నౌకా నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, ఆహార శుద్ధి, ఆక్వా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. రాష్ట్ర తీర ప్రాంత పరిరక్షణతోపాటు పచ్చదనం పెంపునకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పర్యావరణహిత పారిశ్రామిక విధానాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

## సీఈసీపై జనాగ్రహం..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రతిపక్ష నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీసులు భారీగా మోహరించి ర్యాలీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సుప్రీంకోర్టుకు సమీపంలో నిరసనకారులను పోలీసులు నిలువరించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

## సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వాటి వల్ల న్యాయస్థానాల విధులకు అంతరాయం కలగకూడదని పేర్కొన్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొన్న ఇబ్బందులను సీనియర్ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే కోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలిగించరాదని స్పష్టం చేశారు. న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారుల స్వేచ్ఛాయుత రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లను తదుపరి విచారణ కోసం ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

## భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమవుతున్నాయి: కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ, ప్రజాస్వామ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుంటోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ చేతులు కలుపు తున్నాయని, దేశభక్తులంతా ఏకమవుతారని వ్యాఖ్యానించారు.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కేరళ కాంగ్రెస్ సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలపై రిజిజు స్పందించారు. ఢిల్లీలో ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతలు తన పరిధిలోని అంశం కాదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కేరళ కాంగ్రెస్ ఆయన రాజీనామాను డిమాండ్ చేసింది. అనంతరం ఆ పోస్టును తొలగించింది.ఈ పరిణామంపై రిజిజు తీవ్రంగా స్పందిస్తూ, ఎన్నికల సంఘం తర్వాత కాంగ్రెస్ తదుపరి లక్ష్యం న్యాయవ్యవస్థేనని తాను గతంలోనే చెప్పానన్నారు. దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్, భాజపా మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి.

## ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాసంగి పంటలు వేయవద్దని సూచిస్తే రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఉపాధి లేక ప్రజలు మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ సరఫరా, సాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతులకు అందాల్సిన పథకాలపై స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులు, కూలీలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

## 41 బార్ల అనుమతుల కోసం 2,200 దరఖాస్తులు



**హైదరాబాద్,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో కొత్త బార్ల ఏర్పాటు కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ఆబ్కారీ శాఖ జారీ చేసిన ప్రకటన ప్రకారం 41 బార్ల అనుమతుల కోసం సుమారు 2,200 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల స్వీకరణకు సోమవారం చివరి రోజు కావడంతో సంబంధిత కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.మొత్తం 41 బార్లలో 14 హైదరాబాద్ నగర ప్రధాన ప్రాంతంలో ఉండగా, మిగిలిన 27 బార్లను ఇతర నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేందుకు ఆబ్కారీ కమిషనర్ కార్యాలయంతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని సంబంధిత కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుముగా నిర్ణయించారు. కొత్త బార్ల ఏర్పాటుకు ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అనుమతుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. తదుపరి దశలో దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులకు అనుమతులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

## ఎన్నికల్లో ఓటమి భయంతోనే 'సర్' అమలు

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ముఖ్యమని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్యానికి నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే పేదలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని పేర్కొంటూ, దాని వ్యవహారశైలిపై అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల సంఘం నియామక విధానంలో ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక ప్రక్రియ నుంచి తొలగించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.భారతీయ జనతా పార్టీ మతాలు, ప్రాంతాల మధ్య విభేదాలను పెంచుతోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో తమకు అనుకూలంగా లేని ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారన్నది ఆయన ప్రధాన ఆరోపణ. కృత్రిమ మేధ సాయంతో భాజపాకు వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగిస్తున్నారని కూడా ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి వచ్చిన అధికారిక నిర్ధారణను ఆయన ప్రస్తావించలేదు.గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వినిపించిన నినాదాల తరహాలోనే ఇప్పుడు 'సర్ వెనక్కి వెళ్లాలి' అనే నినాదంతో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తాం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని కవిత అన్నారు. మహిళా నాయకులతో కలిసి బతుకమ్మలు పేర్చి, పాటలు పాడారు. అనంతరం గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మ ఆడారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని కవిత పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పండుగ ద్వారా మహిళలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి కృషి చేశామని గుర్తుచేశారు. బతుకమ్మ పాటలను నేర్చుకుని భావితరాలకు అందించాలని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

# ఎఫ్ఐఆర్ నమోదు చేశాకే దహన సంస్కారాలు జరపాలి

**- జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో అకాల మరణాలపై విచారణ జరపాలి**



**జవహర్‌నగర్, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో సంభవిస్తున్న అకాల మరణాలపై సమగ్ర విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాతే దహన సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి ప్రజావాణిలో వినతిపత్రం అందజేసింది. డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతుల్లో శాశ్వతంగా మూసివేయాలని, ప్రభావిత ప్రాంతాల్లో పర్యావరణాన్ని పునరుద్ధరించి ప్రజలకు ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరింది. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వాయువులు, కలుషిత ద్రవాల వల్ల గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కమిటీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం




చేశారు. కార్మికనగర్, గబ్బిలాలపేట, శాంతినగర్, ఆర్జీ కాలనీ, ధమ్మాయిగూడ, ఈస్ట్ నందమూరి నగర్ తదితర ప్రాంతాల్లో దుర్వాసన, గ్యాస్ లీకేజీ సమస్యలు పెరిగాయని తెలిపారు. గతంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. డంపింగ్ యార్డుకు చెత్త తరలింపును నిలిపివేసి, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కమిటీ డిమాండ్ చేసింది. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. జేఏసీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్‌తో పాటు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం

**● శ్రీరామ్ చిట్స్ నుంచి 30 శాతం, చోళమండలం ఫైనాన్స్ నుంచి 50 శాతం డిస్కౌంట్ ● నవంబర్ 21న వరంగల్, నర్సంపేట కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్**




**హనుమకొండ, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** చెక్కు బౌన్స్ కేసులతో పాటు ఇతర రాజీపడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు కక్షిదారులకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు. నవంబర్ 21, శనివారం వరంగల్ జిల్లా కోర్టు, నర్సంపేట కోర్టుల్లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో న్యాయమూర్తి పూజ మాట్లాడుతూ.. న్యాయ సేవాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. చెక్కు బౌన్స్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు, ఇతర రాజీకి అనుకూలమైన కేసులను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను ముందుగానే సంబంధిత కోర్టులకు తెలియజేసి, ఇరుపక్షాలు రాజీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. కక్షిదారులకు మరింత వెసులుబాటు కల్పించేందుకు అక్టోబర్ 12 నుంచి నవంబర్ 20 వరకు ప్రీ-లోక్ అదాలత్ ప్రక్రియ కొనసాగుతుందని పూజ వివరించారు. వరంగల్‌లో రెండు, నర్సంపేటలో ఒకటి చొప్పున మొత్తం మూడు బెంచీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవధిలో సంబంధిత కేసుల వివరాలను సమర్పించి, రాజీ అవకాశాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. చెక్కు మొత్తంపై రాజీ పడేందుకు శ్రీరామ్ చిట్స్ ఫైనాన్స్ సంస్థ 30 శాతం, చోళమండలం ఫైనాన్స్ సంస్థ 50 శాతం డిస్కౌంట్ ప్రకటించినట్లు ఆమె వెల్లడించారు. ఈ రాయితీలకు సంబంధించిన నిబంధనలు, అర్హతల వివరాలను సంబంధిత సంస్థల ద్వారా తెలుసుకుని కక్షిదారులు ముందుకు రావాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సజావుగా సాగేందుకు ఇప్పటికే వివిధ స్థాయుల్లో సమన్వయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంకులు, చిట్‌ఫండ్ సంస్థల మేనేజర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశాలు నిర్వహించి, ఎక్కువ కేసులను పరిష్కరించే దిశగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. కక్షిదారులు తమ న్యాయవాదులతో కలిసి సంబంధిత కోర్టులకు హాజరై, రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని కందుకూరి పూజ కోరారు. ప్రత్యేక లోక్ అదాలత్ ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కీలక పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు.

---

# ములుగులో విద్యుత్ లైన్ల మార్పునకు రూ.3 కోట్లు మంజూరు

**● మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం**



**ములుగు, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు నియోజకవర్గంలో నివాస గృహాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించడంతో ఈ నిధులు విడుదలయ్యాయి. ములుగులోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ప్రమాదాల ముప్పు పొంచి ఉండటంతో లైన్లను మార్చాల్సిన అవసరాన్ని మంత్రి సీతక్క రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వం, తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పనులకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32ను జారీ చేసింది. ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

**ప్రమాదాల నివారణకు చర్యలు**

మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు కావడంతో విద్యుత్ లైన్ల మార్పు పనులకు మార్గం సుగమమైంది. పనులు పూర్తయితే నివాస గృహాల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రజల భద్రతకు మరింత భరోసా లభించనుంది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

---

# రీసర్వే పనుల్లో పారదర్శకత పాటించాలి

**- రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల పునఃసర్వే పూర్తి చేయాలి**
**సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**



**కల్లూరు, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. కల్లూరు డివిజన్ పరిధిలోని తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామంలో ఆయన పర్యటించి, కొనసాగుతున్న భూముల పునఃసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల సర్వే నిర్వహణ తీరును, హద్దుల నిర్ధారణ ప్రక్రియను పరిశీలించి, రీసర్వే పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ రైతులతో ముఖాముఖి మాట్లాడి, రీసర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతోపాటు ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. రీసర్వే సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూముల హద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు. రీసర్వే పనులను పారదర్శకంగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

---

# హైదరాబాద్‌లో మాడ నర్సయ్యకు ఘన సన్మానం

**● ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కృషికి గుర్తింపు**




**హైదరాబాద్, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ, భారతదేశం ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఆవిర్భావ దినోత్సవ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ డా. బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పారదర్శకత మరియు జవాబుదారీతనం కోసం కృషి చేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మాడ నర్సయ్యను ఎమ్మెల్సీ బండ ప్రకాష్ శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆర్టీఐ కార్యకర్తల పాత్ర కీలకమని ఈ సందర్భంగా బండ ప్రకాష్ పేర్కొన్నారు. ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్‌తో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సన్మానం అందుకున్న మాడ నర్సయ్యకు పలువురు అభినందనలు తెలిపారు.

# ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**● ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచాలి..**
**అధికారులకు బీసీ జేఏసీ నేత తోటకూరి శ్రీకాంత్ గౌడ్ వినతి**




**మల్లంపల్లి, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం మల్లంపల్లి మండల ప్రజావాణి స్వీకరణ అధికారికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా సమాచార అధికారుల వివరాలు, సమాచార దరఖాస్తు విధానం, సంబంధిత నిబంధనలను కార్యాలయాల్లో ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, గ్రామపంచాయతీ నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని కోరారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం వెల్లడించాల్సిన సమాచారాన్ని స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా సమాధానాలు అందేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమాచారం అందని సందర్భాల్లో మొదటి అప్పీల్ చేసుకునే విధానంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఆర్టీఐ చట్టం సమర్థవంతంగా అమలైతే ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం పెరిగి, ప్రజలకు ప్రభుత్వ వ్యవహారాలపై స్పష్టత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వినతిపై అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మహమ్మద్ గౌస్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా కుమారస్వామి ఏకగ్రీవ ఎన్నిక

**- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం: నూతన అధ్యక్షుడు**





**మల్లంపల్లి, అక్టోబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని మహమ్మద్ గౌస్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముంజల కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలు, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి సలహాల మేరకు జిల్లా నాయకుడు మేకల ప్రశాంత్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా రొట్టె కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు మహేందర్, కార్యదర్శిగా శ్రీపతి దేవేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోట దేవేందర్, కోశాధికారిగా ఎం.డి. మైబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల కార్తీక్, మాజీ సర్పంచ్ శైలజ సురేష్, గ్రామ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

**- నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**




**కల్లూరు, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో వారి అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా, ప్రాధాన్యత క్రమంలో పరిశీలించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టం చేశారు.

# న్యాయ విలువలు, సామాజిక బాధ్యతతో న్యాయ విద్యను అభ్యసించాలి

**ఆదర్శ లా కాలేజీ ఓరియంటేషన్‌లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శుల సూచన**

**హనుమకొండ,అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు రాజ్యాంగ విలువలకు కట్టుబడి, వృత్తిపరమైన నైతికతతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు కె. పూజ, ఎన్.వి. హైమ పూజిత సూచించారు. న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకుంటూ సమాజంలో న్యాయం, సమానత్వం స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఆదర్శ లా కాలేజీలో ప్రథమ సంవత్సరం న్యాయ విద్యార్థుల కోసం సోమవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయ విద్య ప్రాధాన్యత, రాజ్యాంగ విలువలు, న్యాయవాదుల బాధ్యతలు, వృత్తిపరమైన నైతికతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ వృత్తిలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం ఎంతో







ముఖ్యమని, న్యాయ విద్యార్థులు విద్యాభ్యాస దశ నుంచే ఈ విలువలను అలవర్చుకోవాలని సూచించారు. చట్టాలపై పట్టు సాధించడంతో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, న్యాయం కోసం వచ్చే వారికి అండగా నిలిచే న్యాయ నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డా. పి. ప్రతిభా రాథోడ్ ముఖ్య అతిథులను ఆహ్వానించారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత కలిగిన న్యాయ నిపుణులను తీర్చిదిద్దడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు.**సంప్రదాయాల వైభవాన్ని చాటిన బతుకమ్మ సంబరాలు** ఓరియంటేషన్ కార్యక్రమం అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. న్యాయ విద్యపై అవగాహనతో పాటు సాంస్కృతిక వేడుకలు నిర్వహించడంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

# జవహర్‌నగర్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు ఐక్యంగా ముందుకు రావాలి

**- ప్రభుత్వ స్థలం కేటాయింపు కోసం సమష్టి కృషి చేయాలి: జర్నలిస్టు విజయ్ కుమార్**



**జవహర్‌నగర్, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** జవహర్‌నగర్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు వచ్చి ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేయాలని జర్నలిస్టు చింతల విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యత, ఆత్మగౌరవం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రెస్‌క్లబ్ ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, సంబంధిత అధికారులతో చర్చలు జరపాలని సూచించారు. నిబంధనల ప్రకారం స్థలం కేటాయించేలా జర్నలిస్టులంతా కలిసి ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాలని కోరారు. స్థల గుర్తింపు నుంచి అనుమతుల సాధన వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని తెలిపారు.ప్రెస్‌క్లబ్ ద్వారా జర్నలిస్టుల సమావేశాలు, వృత్తిపరమైన చర్చలు, ప్రజా సమస్యలపై సమాలోచనలు నిర్వహించుకోవచ్చని విజయ్ కుమార్ అన్నారు. కొత్తగా జర్నలిజంలోకి వచ్చే వారికి మార్గదర్శనం చేయడంతోపాటు, జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పత్రికలు, టెలివిజన్ ఛానళ్లతో సంబంధం లేకుండా జర్నలిస్టులందరూ వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించి, ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సంఘాల సహకారంతో కార్యాచరణ రూపొందించాలని సూచించారు.జర్నలిస్టుల ఐక్యతే బలం.. ప్రెస్‌క్లబ్ ఏర్పాటు మన ఉమ్మడి లక్ష్యం అని విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# ఓట్ల చోరీని అరికట్టాలి.. సీఈసీ రాజీనామా చేయాలి

**'చలో ఢిల్లీ ప్రజాస్వామ్యం కోసం' ర్యాలీలో పాల్గొన్న వైద్యుల అంజన్ కుమార్**

**కరీంనగర్, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటు హక్కును పరిరక్షించి, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాలని కరీంనగర్ కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి చేపట్టిన 'చలో ఢిల్లీ ప్రజాస్వామ్యం కోసం' ర్యాలీలో సోమవారం వైద్యుల అంజన్ కుమార్ తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ భవన్ నుంచి బారాఖంబా రోడ్, మండి హౌస్ మీదుగా సుప్రీంకోర్టు సమీపం వరకు ర్యాలీ కొనసాగింది.అనంతరం తెలంగాణ భవన్‌లో






నిర్వహించిన మీడియా సమావేశంలో అంజన్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు హక్కుకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, దానిని కాపాడాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి, ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని పెంపొందించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మేకపోతు చోరీపై పోలీసులకు ఫిర్యాదు



**కురవి, అక్టోబర్ 12(పిసిడబ్లూ న్యూస్):** మహబు బాబాదు జిల్లా కురవి మండలంలోని కొత్తూరు(సి) గ్రామ శివారు గుజిలీతండాకు చెందిన జాటోత్ వెంకన్నకు చెందిన మేకపోతు చోరీకి గురైన ఘటనపై సీరోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.వెంకన్నకు చెందిన మేకపోతును సుమారు 20 రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. అప్పటి నుంచి మేకపోతు కోసం వివిధ ప్రాంతాల్లో వెతుకుతుండగా, కొత్తూరు(సి) గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి ముందు కనిపించింది. దీంతో వెంటనే బాధితుడు సీరోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటనపై విచారణ ప్రారంభించారు.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ద్వితీయ స్థానం సాధించిన ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సన్మానం



**కరీంనగర్, అక్టోబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి 1,961 ఓట్లు సాధించి, మొత్తం 17 మంది అభ్యర్థుల్లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకొని, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి తరపున ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, చింతల కిషన్, బొడ్ల శ్రీనివాస్, కొత్తూరి ముకుందశీ, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, ఆచార్యులు మరియు మాతాజీలు పాల్గొని ఇంజనీర్ కోల అన్నారెడ్డి గారికి అభినందనలు తెలియజేశారు.శిశుమందిర్ డెవలప్మెంట్ కమిటీ కార్యదర్శిగా పాఠశాలను అభివృద్ధి చేసి, సమాజ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత, సేవాభావం మరింతగా విస్తరించాలని, భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ప్రధానచర్యులు మోర రణధీర్ ఆకాంక్షించారు.

# మున్నూరుకాపుల అభ్యున్నతికి ఆత్మీయ సంకల్పం!

**- మున్నూరుకాపు కార్పొరేషన్‌కు 5వేల కోట్లు కేటాయించాలి**

**- ఖమ్మం ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపు**

**- సమున్నత వికాసం వైపు యువత అడుగులు.. సమైక్య సాధనతోనే రాజ్యాధికారం సాధ్యం!**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్నూరుకాపుల అభ్యున్నతికి ఈ ఆత్మీయ సంకల్పం అభినందనీయమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. సోమవారం ఖమ్మంలోని మున్నూరుకాపు హాస్టల్ భవనంలో జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా సంఘం గౌరవాధ్యక్షులు కొత్త సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాజ్యసభ ఎంపీ, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులాల హద్దులు దాటి, గుండెల నిండా ఐక్యతా సంకల్పాన్ని నింపుకున్న వేళ.. మున్నూరుకాపు సమాజ భవిష్యత్తుకు నూతన దిశా నిర్దేశం లభించిందన్నారు. తెలంగాణలో మున్నూరుకాపుల సంక్షేమాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యచరణ, ప్రతిష్టాత్మక పథకాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ. 5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నిధులు అందితే మున్నూరుకాపు నిరుపేద రైతాంగానికి, సాధికారత వైపు అడుగులేస్తున్న మహిళలకు, ఉపాధిని వెతుక్కుంటున్న యువతకు కొండంత అండ లభిస్తుందని ఆకాంక్షించారు.సమాజ పురోగతికి యువతే వెన్నెముక అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కొనియాడారు. "యువత అనుకున్నది సాధించగలదు.. ఐక్యంగా ఉంటూ, ఉన్నత విద్యను











అభ్యసించి నచ్చిన రంగాల్లో రాణించాలి" అని దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో మొదటి నుండి ఏకగ్రీవ ఎన్నికలతో ఐక్యతను చాటడమే తన లక్ష్యమని పేర్కొంటూ, 56 శాతంగా ఉన్న బీసీలందరినీ కలుపుకొని ముందుకు సాగినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మున్నూరుకాపులకు రావాల్సిన సముచిత స్థానం దక్కాలని, రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని స్పష్టం చేశారు.ఖమ్మంలో మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ అభివృద్ధికి, సంఘ మాజీ అధ్యక్షులు మేకల సంగయ్య విగ్రహ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తూ, కుల సేవలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ కలయికలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నూతన జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేంద్రం, మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మున్నూరుకాపు సోదరసోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# గాయత్రీదేవి అలంకారంలో మహాశక్తి అమ్మవారి దర్శనం

**కరీంనగర్‌లో వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు**

**లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. దాండియాకు భారీ ఏర్పాట్లు**





**కరీంనగర్, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో రెండో రోజు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గాయత్రీదేవిని జ్ఞానప్రదాయినిగా, వేదమాతగా భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రతకు ప్రతీకగా భావిస్తారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన లింగార్చన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో రూపొందించిన లింగాకారానికి అభిషేకం చేసి, దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌తో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు దాండియా కార్యక్రమానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు సంప్రదాయ ఉత్సాహంతో దాండియాలో పాల్గొనేలా ఏర్పాట్లు చేపట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో జరిగే పూజలు, ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

## రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని వడ్లూరి శివప్రియ ఎలోక్యూషన్ పోటీలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక





**రామడుగు, అక్టోబర్ 12(పిసి డబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ ఈ ఎల్ టి ఏఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెడ్ టాక్ (ఉపన్యాస) పోటీల్లో రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని వడ్లూరి శివప్రియ మొదటి స్థానం తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఎలోక్యూషన్ పోటీలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనందున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మేయర్ శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు నాగరాజు,రత్నాకర్,కట్ట రవీంద్రాచారి,శ్రీనివాసా చారి,రాజేంద్రా చారి ఉన్నారు.

# ఖమ్మానికి ఆధ్యాత్మిక శోభ తీసుకురానున్న శ్రీవారి ఆలయం

**ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ, శంకుస్థాపన**

**కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి**





**ఖమ్మం, అక్టోబర్ 12 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం శుభపరిణామమని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆలయానికి ఆయన, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రజలంతా ధర్మమార్గంలో పయనించాలని, అందరూ ఒకే భగవంతుని సంతానమనే భావనతో ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సామాజిక ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని అన్నారు. ఖమ్మంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయం ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ చైర్మన్, అధికారుల సహకారంతో త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ, ఖమ్మంలో ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి కీలకమని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, ఖమ్మం ఆలయాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానిక ఆలయ నిర్మాణానికి టీటీడీ నిబంధనల ప్రకారం భక్తుల నుంచి కూడా నిధులు సమకూర్చాల్సి ఉంటుందని వివరించారు. **ఆలయ నిర్మాణానికి విరాళాలు** ఖమ్మం శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి మరో రూ.11 లక్షలు అందించేందుకు ముందుకొచ్చారు. భక్తులందరూ విరాళాలు అందించి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు కమిషనర్‌ను కలిసిన ఎంఐఎం ఉమ్మడి జిల్లా నాయకులు



**కరీంనగర్, అక్టోబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఎంఐఎం నాయకులు, జిల్లా పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ను పోలీస్ కమిషనరేట్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. గులాం అహ్మద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత ఉమ్మడి జిల్లా నాయకులతో కలిసి, మొదటగా కరీంనగర్ జిల్లా పోలీసు కమిషనర్ ను కలవడం పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, తమ వంతుగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, లింగపల్లి శ్రీనివాస్, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఎంఏ సలీం, అబ్దుల్ గఫ్ఫార్, వాజిద్ అలీఖాన్, ఖాజా మజారోద్దీన్, సాజిద్, అక్బర్ అలీ, సురేశ్, గాలి రాజు, ఇంతియాజ్, జుబేర్ ఖురేషీ, షాకిర్ నఖ్వీ, పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ వకీల్, ఉమేర్, కోరుట్ల నాయకులు హాఫిజ్ ఖురేషీ, రహీం, వాజిద్, నిజాం, సిరిసిల్ల నాయకులు ముస్తఫా, పర్వేజ్, అహ్మద్ ఖాన్, నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మేదరి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు





**కరీంనగర్, అక్టోబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** మేదరి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్‌లోని సంఘ భవనంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు పూలను పూజిస్తూ ప్రత్యేకంగా జరుపుకోవడం ఎంతో గొప్ప విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతి వైభవానికి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేదరి మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి పిట్టల స్వప్నతో పాటు లక్ష్మీ భాగ్య జ్యోతి సుజాత పలువురు మహిళలు పాల్గొన్నారు.

# దసరా కానుకగా తక్కువ బడ్జెట్‌లో స్థలాలు

**● 'గోల్డెన్ ఇన్ఫో ప్రాజెక్ట్స్' దసరా ధమాకా ఆఫర్లు ● జనగామ వద్ద గుంట స్థలం కేవలం రూ. 2 లక్షలకే.. ● సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జె. చెన్నకేశవులు వెల్లడి**




**హైదరాబాద్, అక్టోబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** మధ్యతరగతి, పేద ప్రజలకు సైతం సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి మరియు భవిష్యత్తు అవసరాల కోసం భూమిపై పెట్టుబడిని అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో 'గోల్డెన్ ఇన్ఫో ప్రాజెక్ట్స్' సంస్థ దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ విషయాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జె. చెన్నకేశవులు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వరంగల్ జాతీయ రహదారికి సమీపంలో, జనగామ జిల్లా కేంద్రానికి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో 7 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దసరా పండుగ ఆఫర్ కింద మొదటి 50 బుకింగ్‌లకు మాత్రమే గుంట స్థలాన్ని రూ. 2 లక్షలకే (పూర్తి చెల్లింపు చేసిన వారికి) అందించనున్నట్లు పేర్కొన్నారు. భూమి (నాలా) మార్పిడి మరియు రిజిస్ట్రేషన్ రుసుములను కంపెనీయే ఉచితంగా భరిస్తుందన్నారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ సాధారణ ధర రూ. 3 లక్షలుగా ఉంటుందని చెప్పారు. అలాగే నారాయణ్‌ఖేడ్ సమీపంలోని హంగిర్గా వద్ద భవిష్యత్తులో జాతీయ పెట్టుబడులు, తయారీ రంగానికి సంబంధించిన బృహత్ పారిశ్రామిక జోన్ (నిమ్జ్) రాకతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో హంగిర్గా గ్రామంలో ఒక గుంట స్థలాన్ని ఆఫర్ కింద కేవలం రూ. 1,50,000 కే తక్షణ రిజిస్ట్రేషన్‌తో అందిస్తున్నట్లు తెలిపారు. **ప్రపంచస్థాయి వసతులు:** ఈ ప్రాజెక్టులలో ఇల్లు కట్టుకోవడానికి మరియు పెట్టుబడికి అనుకూలంగా అన్ని రకాల అభివృద్ధి పనులను పూర్తి చేసి ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చుట్టూ కాంపౌండ్ గోడలు, 30 అడుగుల విశాలమైన రహదారులు, సౌర విద్యుత్ దీపాల వ్యవస్థ, మొక్కల పెంపకం, బిందు సేద్యం (డ్రిప్) సదుపాయం మరియు ఉచిత నాలా అనుమతులు అందిస్తున్నట్లు వెల్లడించారు. **త్వరలో మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు:** రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయతతో దూసుకుపోతున్న గోల్డెన్ ఇన్ఫో ప్రాజెక్ట్స్ సంస్థ ప్రస్తుతం అమీర్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పల్ ప్రాంతాల్లోని కార్యాలయాల నుంచి సేవలు అందిస్తోంది. త్వరలోనే పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (హెచ్ఎమ్‌డీఏ), రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (రేరా) అనుమతులతో సుమారు రూ. 1.5 కోట్ల బడ్జెట్‌లో అత్యాధునిక విల్లా ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ జె. చెన్నకేశవులు తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులకు, ఏజెంట్లకు మరియు పాత్రికేయ మిత్రులకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. తక్కువ బడ్జెట్‌లో సురక్షితమైన పెట్టుబడి పెట్టుకోవడానికి ఈ దసరా ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

## ముందస్తు సద్దుల బతుకమ్మ పండగ ఉత్సవాలు పనులు ఏర్పాట్లు..



**రామడుగు, 12 అక్టోబర్ (పిసిడబ్ల్యూ న్యూస్ ):** రామడుగు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులురామడుగు గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించే ఏర్పాట్లలో భాగంగా గ్రామంలోగల మూడు బతుకమ్మ (ఘాట్లు)సరమ్మచెరువు, నరసింగరావు చెరువు, అయ్యెరు కుంట చెరువులు వద్ద మన గ్రామఆడబిడ్డలు, మహిళామణులు బతుకమ్మ ఆట ఆడుకునేవిధంగా బతుకమ్మ ల నిమజ్జనం చేయడం కొరకు తగు ఏర్పాట్లు చేయడానికి గాను పనులు చేపట్టి ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ ఉప సర్పంచ్ పెందోట రాజు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్, ఎండీ ఆరీఫ్,కర్నె శ్రీలత - శ్రీనివాస్, సిరికొండ పల్లవి - సాయి తేజ,చంద అనిల్,రాగం స్వప్న - రవి,నీలం అరుణ - లక్ష్మణ్, సామంతుల సుజాత - తిరుపతి, మామిడి శ్రావణ్, కారుపాకల నరేష్, మ్యాడారంఅర్చనఅనిల్, మామిడికుమార్, సిరిగిరి వెంకటేశం గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కమలాపూర్ ప్రజావాణికి 17 దరఖాస్తులు

- ఇందిరమ్మ ఇండ్లకు అత్యధికంగా 12 దరఖాస్తులు



**కమలాపూర్ అక్టోబర్ 12(పిసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో ఎంపీడీవో గుండె బాబు ప్రజల నుంచి 17 దరఖాస్తులు స్వీకరించి ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు.ప్రజావాణిలో అత్యధికంగా 12 దరఖాస్తులు ఇందిరమ్మ ఇండ్లకు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.అనంతరం పెండింగ్ దరఖాస్తులు సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో గుండె బాబు తెలిపారు.

# ఉపాధి కల్పించండి - పని రోజులు పెంచండి

- ఎలనినో ప్రభావంతో వట్టిపోతున్న ఉపాధి
- బికెఎంయు వినతి



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలో పరిస్థితులు దయనీయంగా మారాయని వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్లు తెలిపారు. సోమవారం ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం సమర్పించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు దొరకడం లేదని గ్రామీణ ప్రాంత కూలీలు ఉపాధి కోసం ఆటోలపై 30 నుంచి 60 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తున్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. విబిజి రాంజీ పథకం పనులను తక్షణం ప్రారంభించి పని దినాలను పెంచడంతో పాటు మారిన పరిస్థితులకు అనుగుణంగా కూలీ ధరలు పెంచాలని వారు వినతి పత్రం లో పేర్కొన్నారు. ఖమ్మంజిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ పనులు జరగడం లేదని అతి తక్కువ వర్షాపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం కూడా ఒకటని వారు వినతి పత్రంలో తెలిపారు. దూర ప్రాంతాలకు కూలీ కోసం వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మహిళా కూలీ ఆటో ప్రమాదంలో మృతిచెందడంతో పాటు పలువురు గాయపడ్డారని వారు తెలిపారు. కేవలం నర్సరీలలో మాత్రమే ఉపాధి పనులు చేపడుతున్నారని మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనులను ఎంపిక చేసి ఉపాధి కల్పించాలన్నారు. పని రోజులను 200లకు పెంచాలని కనీస వేతనం రూ. 600లకు గిట్టుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులతో సమీక్ష చేస్తామని, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, నాయకులు మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, గోగుల ఆదినారాయణ పాల్గొన్నారు.

# కాచిగూడలో 'పవిత్ర ఫుడ్‌కోర్టు' ప్రారంభం




**కాచిగూడ, అక్టోబర్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యాపారాభివృద్ధికి వినియోగదారుల అపార నమ్మకమే అసలైన పెట్టుబడి అని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం కాచిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'పవిత్ర ఫుడ్‌కోర్టు'ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాచిగూడ మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌కోర్టు నిర్వాహకుడు ఉపేంద్రకుమార్, నాగోర్ జైన్ సంఘం చైర్మన్ శ్రీపాల్ జైన్, ఉస్వాల్ జైన్ కోఠీ అధ్యక్షుడు మహావీర్ జైన్, మేనేజర్ ఉత్కర్ష్, డాక్టర్ శిరీషా యాదవ్, ఓం ప్రకాష్ యాదవ్, కన్నె రమేష్ యాదవ్, భీష్మాదేవ్, నాగేందర్ బాబ్జీ, బబ్లూ సింగ్, అంటో, పట్లూరి సతీష్, శ్రీకాంత్ ముదిరాజ్, నర్సింగ్ బాబు, బుచ్చిరెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





- పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**కమలాపూర్ అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టి కాలయాపన చేస్తుందని ఎమ్మెల్యే మండిపడ్డారు. హుజురాబాద్ నియోజకవర్గం లో దళిత బంధు రెండో విడత నిధులను ఎందుకు విడుదల చేస్తలేదో అర్థం కావడం లేదని అన్నారు.కెసిఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ఒకేసారి లబ్ధిదారుల ఖాతాలో 10 లక్షలు జమ చేశారు.లబ్ధిదారుల ఖాతాలో ఉన్నటువంటి నిధులను విత్ డ్రా చేసుకోకుండా ప్రభుత్వం వారి అకౌంట్లను ఫ్రీజ్ చేసి ఇబ్బంది పెడుతుందని అన్నారు.ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా నిధులు మంజూరు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చెయ్యాలని అన్నారు.కమలాపూర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కమలాపూర్ మండల కేంద్రం లో నూతన బస్టాండ్ నిర్మాణానికి కె సి ఆర్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టారని,ఆ నిధులు సరిపోక మధ్యలోనే నిలిచాయనిప్రభుత్వం వెంటనే రెండు కోట్లు కేటాయించి బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. కమలాపూర్ మండల అభివృద్ధి కి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ప్రజలకు హామి ఇచ్చారు.ఈ కార్య క్రమంలో తహశీల్దార్ యం సురేష్ కుమార్ ఫాక్స్ చైర్మన్ పేరాల సంపత్ రావ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి, సర్పంచ్ ల ఫోరం ఆద్యక్షులు రాజేష్,కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్,ఫాక్స్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి,మండలం లోని గ్రామాల సర్పంచ్ లు,మార్కెట్ డైరెక్టర్లు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,జి పి ఓలు, రెవెన్యూ సిబ్బంది,పంచాయితీ కార్యదర్శులు,మండల సిబ్బంది, కళ్యాణ లక్ష్మి,షాది ముభారక్ లబ్ధిదారులు,వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటా: నాగూర్ల వెంకటేశ్వరరావు



**ఆత్మకూరు, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలంగాణ రైతు రుణవిమోచన కమిటీ రాష్ట్ర మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు నాగూర్ల వెంకటేశ్వరరావు అన్నారు.ఆత్మకూరు మండలం హౌస్ బుజుర్గ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నీలం కుమార్ రమేష్ తండ్రి నీలం సారయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న నాగూర్ల వెంకటేశ్వరరావు సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు అండగా నిలుస్తానని తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా, జిల్లా యువజన కార్యదర్శి వంగేటి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు అంకతి రవి, మండల ప్రధాన కార్యదర్శి డొంకదువ్వ రాజన్న, గ్రామ అధ్యక్షుడు భాష బోయిన సాగర్, హుస్సేన్, ముత్యాల చిన్న రవి, ముత్యాల మహేందర్, శ్రీపతి ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ నిమ్మల బిక్షపతి, మహమ్మద్ హుస్సేన్, దుప్పటి శంకర్, దొడ్డిపాక రాజన్న, పెండాల బిక్షపతి, ముత్యాల పెద్ద రవి తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి

**ప్రజల్లో ఐక్యత, సద్భావన పెంపొందించాలి: త్రిదండి చిన్నజీయర్ స్వామి**

**ఖమ్మానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న శ్రీవారి ఆలయం**







**ఖమ్మం, అక్టోబర్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభపరిణామమని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ధర్మమార్గంలో పయనిస్తూ, సమాజంలో ఐక్యత, సద్భావనను పెంపొందించాలని పిలుపునిచ్చారు.సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తదితరులు కలిసి భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ భగవంతుని దృష్టిలో కులం, మతం కంటే భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనానికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఇతరులకు మేలు చేయాలని కోరుకునే ప్రతి ఒక్కరూ సమాజానికి మిత్రులేనని అన్నారు. మనమంతా ఒకే భగవంతుని సంతానమని, ఒకే భూమాతకు చెందినవారమని గుర్తించాలని సూచించారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా మానవత్వం, పరస్పర సహకారం, ధర్మం, సమాజ శ్రేయస్సుకు కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఖమ్మంలో నిర్మించనున్న శ్రీవారి ఆలయం ప్రజలకు ఆధ్యాత్మిక ప్రేరణనిస్తుందని, స్వామివారి అనుగ్రహం అందరికీ కలగాలని అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ చైర్మన్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయి ఖమ్మం ప్రాంతం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఖమ్మంలో ఆలయ నిర్మాణానికి స్థానిక భక్తులు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఆలయ నిర్మాణానికి ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# కొత్త పిచ్.. ఎలా స్పందిస్తుందో!

### ఎర్ర, నల్ల మట్టి మిశ్రమంతో పిచ్ సిద్ధం

### ఉప్పల్‌లో భారత్‌వెస్టిండీస్ నాలుగో టీ20.. భారీ స్కోర్లకు అవకాశం



హైదరాబాద్:భారత్, వెస్టిండీస్ టీ20 సిరీస్ భారీ స్కోర్లతో ఆసక్తికరంగా సాగుతున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానుల దృష్టి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంపై పడింది. ఈ సిరీస్‌లో నాలుగో టీ20 మ్యాచ్ బుధవారం ఉప్పల్‌లో జరగనుంది. సిరీస్‌ను గెలుచుకోవాలని భారత్ పట్టుదలతో ఉండగా, పోటీలో నిలిచి సిరీస్‌ను సమం చేయాలని వెస్టిండీస్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు కొత్తగా రూపొందించిన పిచ్‌ను కేటాయించడంతో అది ఎలా స్పందిస్తుందన్న ఆసక్తి నెలకొంది. **15 ఏళ్ల తర్వాత కొత్త పిచ్‌లు**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉప్పల్ స్టేడియంలో సుమారు 15 ఏళ్ల తర్వాత పిచ్‌లను మార్చింది. గతంలో ఎర్రమట్టితో రూపొందించిన పిచ్‌లు ఉండగా, తాజాగా ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కొత్త పిచ్‌లను సిద్ధం చేశారు. పిచ్‌లతోపాటు మైదానం వెలుపలి ప్రాంతాన్ని కూడా ఆధునీకరించే చర్యల్లో భాగంగా ఈ మార్పులు చేపట్టారు. కొత్త పిచ్‌పై భారత్‌వెస్టిండీస్ మ్యాచ్ జరగనుండటంతో బ్యాటింగ్, బౌలింగ్‌కు ఎలాంటి పరిస్థితులు అనుకూలిస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది.**గతంలో పరుగుల వరద** ఉప్పల్ స్టేడియం భారీ స్కోర్లకు పేరుగాంచింది. ఇక్కడ జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు భారీ పరుగులు సాధించారు. 2024లో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారత్ 297 పరుగులు నమోదు చేసింది. 2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 286 పరుగులు సాధించింది. ఈ నేపథ్యంలో కొత్త పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలించి మరోసారి భారీ స్కోర్లకు వేదికగా మారుతుందా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. **బ్యాట్‌కు, బంతికి సమాన పోటీ ఉంటుందా?** ఎర్రమట్టి పిచ్‌లపై సాధారణంగా బ్యాటింగ్ అనుకూలంగా ఉంటుంది. తాజాగా రూపొందించిన మిశ్రమ మట్టి పిచ్‌లో ఎర్రమట్టి లక్షణాలతోపాటు నల్లమట్టి స్వభావం కూడా ఉండనుంది. దీనివల్ల బంతికి మంచి వేగం, బౌన్స్ లభించే అవకాశం ఉంది. బంతి కొత్తగా ఉన్నప్పుడు బౌలర్లకు సహకారం లభించవచ్చని, బంతి పాతబడిన తర్వాత బ్యాటర్లు పరుగులు సాధించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా. ఈ పిచ్‌పై కూడా 200కు పైగా పరుగులు నమోదయ్యే అవకాశాలున్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. **సిరీస్ విజయం కోసం ఇరు జట్ల పోరాటం** భారత్ సిరీస్ విజయంపై దృష్టి పెట్టగా, వెస్టిండీస్ సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. కొత్త పిచ్‌పై టాస్ కీలకం కానుందా? తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు భారీ స్కోరు సాధిస్తుందా? లేక బౌలర్లు ఆధిపత్యం చెలాయిస్తారా? అన్న ప్రశ్నలకు మ్యాచ్‌లోనే సమాధానం లభించనుంది. కొత్త పిచ్ స్వభావం, ఇరు జట్ల వ్యూహాలు, బ్యాటర్ల దూకుడు ఉప్పల్ మ్యాచ్‌ను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి.

# టీ20 సిరీస్ టైటిల్ స్పాన్సర్‌గా ముత్తూట్ ఫిన్‌కార్ప్

● భారత క్రికెట్‌తో మరింత చేరువయ్యే అవకాశం




హైదరాబాద్:భారత్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో కుదిరిన ఒప్పందం ప్రకారం భారత్‌లో జరిగే దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు ఈ సంస్థ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ సందర్భంగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ థామస్ జార్జ్ మాట్లాడుతూ, భారత ప్రజలకు మరింత చేరువయ్యేందుకు క్రికెట్ ఒక అర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను కలిపే క్రికెట్‌తో భాగస్వామ్యం తమ సంస్థకు ప్రత్యేక అవకాశమని పేర్కొన్నారు.బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ మాట్లాడుతూ, భారత జట్టు స్వదేశీ సీజన్‌కు ముత్తూట్ ఫిన్‌కార్ప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించడం భారత క్రికెట్ విస్తృతి, ప్రజలతో దాని అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా క్రికెట్ అభిమానులతో సంస్థ అనుబంధం మరింత బలపడనుంది.

# గెలుపు ముంగిట హైదరాబాద్!

### త్రిపుర రెండో ఇన్నింగ్స్ 99/7.. మరో 61 పరుగుల వెనుకంజ

### ఇన్నింగ్స్ విజయంపై హైదరాబాద్ గురి



హైదరాబాద్:రంజీ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ విజయానికి చేరువైంది. బౌలర్లకు అనుకూలిస్తున్న పిచ్‌పై హైదరాబాద్ బౌలర్లు విజృంభించడంతో త్రిపుర జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలిన త్రిపుర, రెండో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. దీంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అధిగమించేందుకు ఇంకా 61 పరుగులు చేయాల్సి ఉంది. మిగిలిన మూడు వికెట్లను త్వరగా పడగొట్టి ఇన్నింగ్స్ విజయంతో టోర్నీలో శుభారంభం చేయాలని హైదరాబాద్ జట్టు పట్టుదలతో ఉంది.**తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ ఆధిపత్యం**అంతకుముందు హైదరాబాద్ తన తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులకు ఆలౌటై 160 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో జట్టు ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. తన్మయ్ అగర్వాల్ 54 పరుగులతో అర్ధశతకం సాధించగా, రుతిక్ యాదవ్ 150 బంతుల్లో ఐదు ఫోర్లతో 61 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. సీవీ మిలింద్ 55 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. రాహుల్ 119 బంతుల్లో 40 పరుగులు చేయగా, అనికెత్ రెడ్డి 20 పరుగులు చేశాడు. త్రిపుర బౌలర్లలో సందీప్ సర్కార్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అయినప్పటికీ హైదరాబాద్ బ్యాటర్లు కీలక పరుగులు సాధించడంతో జట్టు భారీ ఆధిక్యాన్ని అందుకుంది.

**రెండో ఇన్నింగ్స్‌లోనూ త్రిపురకు కష్టాలు** 160 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన త్రిపుర బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడ్డారు. వరుసగా వికెట్లు కోల్పోవడంతో జట్టు కష్టాల్లో పడింది. స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్ క్రమాన్ని దెబ్బతీశాడు. కెప్టెన్ మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీసి తన వంతు పాత్ర పోషించాడు. రుతిక్ యాదవ్, అభిరాథ్ రెడ్డి చెరో వికెట్ సాధించి త్రిపురను మరింత ఒత్తిడిలోకి నెట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన త్రిపుర ఇంకా 61 పరుగుల వెనుకంజలో ఉండటంతో హైదరాబాద్ విజయం దాదాపు చేరువలో కనిపిస్తోంది. చివరి రోజు ఉదయం సెషన్‌లో మిగిలిన మూడు వికెట్లు త్వరగా తీస్తే ఇన్నింగ్స్ విజయాన్ని అందుకునే అవకాశం ఉంది.బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీలో తొలి విజయాన్ని నమోదు చేయాలని చూస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన ఆధిక్యం, రెండో ఇన్నింగ్స్‌లో బౌలర్ల ప్రదర్శన జట్టుకు కలిసొచ్చాయి. త్రిపుర మిగిలిన వికెట్లను కాపాడుకుంటూ లోటును అధిగమించేందుకు ప్రయత్నించనుండగా, హైదరాబాద్ బౌలర్లు మ్యాచ్‌ను త్వరగా ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నారు. చివరి రోజు ఆటలో హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయాన్ని అందుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది

# ఎంఎస్ఎల్ విజేత రేజింగ్ బుల్స్

- ఫైనల్లో సన్‌క్రెస్ట్ వారియర్స్‌పై మూడు వికెట్లతో విజయం




మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్ (ఎంఎస్ఎల్) తొలి సీజన్ విజేతగా రేజింగ్ బుల్స్ నిలిచింది. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో సన్‌క్రెస్ట్ వారియర్స్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.తొలుత బ్యాటిం గ్ చేసిన సన్‌క్రెస్ట్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. రామ్ పాటిల్ 40 పరుగులతో రాణించాడు. రేజింగ్ బుల్స్ కెప్టెన్ హరీశ్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు పరుగుల వేగాన్ని నియంత్రించాడు.అనంతరం 158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రేజింగ్ బుల్స్ 19.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

పవన్ చెరుకూరి 47 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, ఓపెనర్ అబిద్ అజహరుద్దీన్ 41 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సిరీస్ అంతటా నిలకడగా రాణించిన నీరజ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా, ఫైనల్లో మూడు వికెట్లు తీసిన హరీశ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లీగ్‌కు మంచి స్పందన లభించిందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.పి. రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది నుంచి రెండు సీజన్లు నిర్వహించడంతోపాటు, ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా వేలం నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. వెటరన్ క్రికెటర్ల ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ లీగ్ మంచి వేదికగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. భవిష్యత్తులో పోటీలను దక్షిణ మండల స్థాయి నుంచి దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# టీసీఏతో గ్రామీణ క్రికెటర్లకు భరోసా!



### 32 జిల్లాల యువ ఆటగాళ్లకు అన్యాయం జరగకుండా పోరాటం

### అవసరమైతే బీసీసీఐ కార్యాలయం ఎదుట వేల మందితో ధర్నా: ధరం గురువారెడ్డి

హైదరాబాద్: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించి, రంజీ ట్రోఫీతో పాటు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి తీర్చిదిద్దడమే తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ప్రధాన లక్ష్యమని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ, తగిన అవకాశాలు లభించక పలువురు యువ ఆటగాళ్లు వెనుకబడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఆదివారం వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–19 లీగ్ చాంపియన్‌షిప్ పోటీలను టీసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయచందర్‌రెడ్డితో కలిసి గురువారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అవసరమని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలోని 32 జిల్లాల క్రికెటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గురువారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎదిగే క్రీడాకారులకు సమాన అవకాశాలు కల్పించాలని, వారి ప్రతిభకు తగిన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రికెట్‌లో ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రాంతంతో సంబంధం లేకుండా అర్హులైన ఆటగాళ్లకు ముందుకు వెళ్లే అవకాశం కల్పించాలని అన్నారు.గ్రామీణ క్రికెటర్లకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు అవసరమైతే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యాలయం ఎదుట వేల మందితో ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామీణ ప్రాంత యువ ఆటగాళ్లకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రికెట్ ప్రతిభను వెలికితీసి, యువ ఆటగాళ్లకు సరైన వేదిక కల్పించడమే లక్ష్యంగా టీసీఏ పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో వలస జీవుల పాత్రను గుర్తించాలి

- ముంబై, భివండి, సూరత్ ఉద్యమకారులకు గౌరవం కల్పించాలి



**హైదరాబాద్, అక్టోబర్ 12 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముంబై, భివండి, సూరత్ తదితర ప్రాంతాల్లో నివసించిన తెలంగాణ వలస ప్రజలు కీలక పాత్ర పోషించారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఉద్యమకారులు కోరుతున్నారు.జీవనోపాధి కోసం స్వస్థలాలకు దూరంగా ఉన్నప్పటికీ తెలంగాణ సాధనే లక్ష్యంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని తమ మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఉద్యమంలో భాగస్వాములైన వలస జీవుల వివరాలను సేకరించి, అర్హులైన వారికి సముచిత గుర్తింపు, గౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఇతర రాష్ట్రాల్లో జరిగిన పోరాటాలకు కూడా స్థానం కల్పించాలని కోరారు.

# మేధ, జై జాస్తి జంటగా

## మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం






టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.

# అల్లు అర్జున్ తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్న లోకేశ్

### "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే.." అంటూ క్యాప్షన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి.అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ వీడియో సినిమా కథ గురించి పెద్దగా వివరాలు వెల్లడించకపోయినా.. ప్రాజెక్టుపై భారీ అంచనాలు పెంచింది.'ఏఏ23'ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గతంలో అల్లు అర్జున్ నటించిన బ్లాక్‌బస్టర్ 'పుష్ప'ను కూడా ఈ నిర్మాణ సంస్థే తెరకెక్కించింది. అయితే 'ఏఏ23' కథ, ఇతర నటీనటులు, చిత్రీకరణ వివరాలపై అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది.మరోవైపు అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా తొలిసారి జంటగా కనిపించనున్న ఈ సినిమాపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా 'రాకా'ను అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.ఇప్పుడు 'ఏఏ23'పై లోకేశ్ చేసిన తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందా? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

# నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

### ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి





దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు.'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు.రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అసలు ఊహించలేదు..

## జడ్జిగా అవకాశం రావడంపై అనుపమ కామెంట్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ నటిస్తూ అదరగొడుతున్న ఆమె, త్వరలోనే 'క్రేజీ కల్యాణం' సినిమాతో అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న అనుపమ, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా రియాలిటీ షోకి జడ్జిగా మారడంపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. షాకింగ్‌గా అనిపించింది: ఇంటర్వ్యూలో భాగంగా "అది కొత్త ఏమీ కాదు.. జడ్జి అవ్వడం, డాన్స్ షో చేయడం మీకు ఎలా అనిపించింది?" అని ప్రశ్నించగా, అనుపమ చాలా సరదాగా స్పందించారు. "నాకు కూడా ఇదొక పెద్ద షాకే. నేను అసలు ఊహించలేదు. సడన్‌గా అలాంటి ఒక అవకాశం వచ్చింది. కొత్త విషయాలను ప్రయోగాత్మకంగా చేయడం నాకు ఇష్టం కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇప్పటికే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు చేశాను" అంటూ తన ఆశ్చర్యంతో పాటు ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. 'ఢీ' షోలో జడ్జిగా ఎంట్రీ: తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'ఢీ' డ్యాన్స్ షోకు అనుపమ పరమేశ్వరన్, జానీ మాస్టర్ జడ్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్టింగ్‌తో అలరించే అనుపమ, తొలిసారి ఒక డ్యాన్స్ రియాలిటీ షోకి జడ్జిగా ఎంట్రీ ఇవ్వడం ఆమె కెరీర్‌లో మరో విశేషంగా నిలిచింది. పల్లెటూరి నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం': ఇదిలా ఉంటే, అక్టోబర్ 16న విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధువుల గొడవలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

# పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..

## అల్లు అరవింద్ స్పెషల్ నోట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

"ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.



Dear
Sri Pawan Kalyan,

I am surprised and almost shocked to realise that our first film together has completed 30 years. What a remarkable journey you have had in this industry!

My heartfelt congratulations on completing 30 years.

I wish you many more years of success and fulfilment in whichever path you choose.

Above all, I sincerely appreciate your broader vision for society and the contributions you have been making beyond cinema.

Congratulations once again, dear Kalyan. My best wishes and blessings always.

With love,
Allu Arvind




# 'కాస్ట్' టీజర్ విడుదల

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేశారు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ ఈ సినిమాతో జంపన్నకు చాలా మంచి పేరు రావాలని, మరిన్ని సక్సెస్‌ఫుల్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 'మా హీరోలు వరుణ్ సందేశ్, గగన్, రవితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. త్వరలోనే పాటలు విడుదలవుతాయి. డైరెక్టర్ ఈ సినిమాను బ్రహ్మాండంగా తీశారు' అని అన్నారు. డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి, గగన్ అద్భుతంగా నటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు, నవీన్ ఎర్నేని, గగన్ బాబు, అనూప్ రూబెన్స్, రవి, సత్యం రాజేశ్, దివి వద్యా పాల్గొన్నారు.